క్లుప్తంగా

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



సాకుర్రులో విద్యార్థులకు స్కూల్ కిట్లు అందజేస్తున్న నాయకులు

అమలాపురం రూరల్: విద్యార్థులు మౌలిక వసతులను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలను సాధించాలని ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్ అన్నారు. సాకుర్రు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పథకంలో విద్యార్థులకు స్కూల్ కిట్లు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుత్తుల చిరంజీవిరావు, మాజీ సర్పంచ్‌లు చొల్లంగి సాయిబాబు, ములపర్తి సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు పి.బాబురావు, పాలమూరి ధర్మపాల్, పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్ ఈదరపల్లి విజయ వేణి తదితరులు పాల్గొన్నారు.

2న ఎల్జీ బాధ్యతల స్వీకరణ

యానాం: పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమితులైన మాజీ ఐఏఎస్ అధికారి కె.కైలాష్‌నాథన్ వచ్చే నెల 2వ తేదీన బాధ్యతలు స్వీకరించనున్నారు. అదేరోజు అసెంబ్లీలో పుదుచ్చేరి 2024–25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నెల 31న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రస్తుత ఎల్జీ రాధాకృష్ణన్ ప్రసంగిస్తారని ఇప్పటికే ప్రకటించారు. అయితే ఆయన మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాల ప్రారంభంలో రాధాకృష్ణన్ ప్రసంగిస్తారా లేక నూతన లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత అసెంబ్లీ నుద్దేశించి ప్రసంగిస్తారా అనేది తేలాల్సి ఉంది.

ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను పూజించాలి

తాళ్లరేవు: ప్రతిఒక్కరూ తల్లిదండ్రులు, గురువులను పూజించాలని ప్రముఖ గురువు బొడ్డు సత్యనారాయణ అన్నారు. తాళ్లరేవు శివారు శ్రీరంగనాయకపురం గ్రామంలో అచల గురు శివరామ దీక్షిత వార్షికారాధన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువు బొడ్డు సత్యనారాయణ మాట్లాడుతూ తల్లిదండ్రులే మనకు కనిపించే ప్రత్యక్ష దైవాలని, వారి ఆశయాలకనుగుణంగా జీవించిన వారే అభివృద్ధి సాధిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఆకుల సత్యనారాయణ, బొడ్డు కృష్ణమూర్తి, ఆకుల వెంకటేశ్వర్లు, వాసంశెట్టి నాగేశ్వరరావు, నానిబాబు, నాగు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా మొక్కలు నాటాలి

అమలాపురం టౌన్: ప్రతిఒక్కరూ ఇంటింటా మొక్కలు నాటాలని డివిజన్ సత్యసాయి సేవా సంస్థల కో ఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన అమలాపురంలోని తన ఇంటి ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా శ్రీసత్యసాయి ప్రేమ తరువు పేరుతో ప్రారంభించిన కోటి పచ్చని మొక్కలు నాటే కార్యక్రమం సోమవారం నుంచి ప్రారంభమైందన్నారు. జిల్లాలో ఐదు వేల మొక్కలు నాటడాన్ని లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు.

విద్యార్థులకు పండ్లు, స్వీట్ల అందజేత



తాళ్లరేవు హైస్కూల్‌లో విద్యార్థులకు పండ్లు అందజేస్తున్న దాతలు

తాళ్లరేవు: ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ సమగ్ర శిక్షా కార్యక్రమంలో భాగంగా సోమవారం శుభ తిథి భోజన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు దాతల సహకారంతో పండ్లు, స్వీట్లు అందజేశారు. స్థానిక నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సంగాడి కామేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆయన భార్య భద్రావతి, కుమార్తెలు వెంకట రమణాదేవి, మహాలక్ష్మిలచే విద్యార్థులకు అరటిపండ్లు అందజేశారు. అదేవిధంగా నీలపల్లి, చినబొడ్డు వెంకటాయపాలెం, కొత్త కోరంగి హైస్కూల్స్‌లో విద్యార్థులతో కలిసి స్థానిక నాయకులు భోజనాలు చేశారు. కార్యక్రమాల్లో నీలపల్లి సర్పంచ్ చిట్టూరి నాగమణి, హెచ్‌ఎంలు జె.ఆశాలత, కె.రాధాకృష్ణ, కేఆర్‌కే సాయిప్రసాద్, చిట్టూరి కలికిమూర్తి, గంజా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కామనగరువులో ఫాగింగ్

అమలాపురం రూరల్: అధిక వర్షాల కారణంగా దోమల బెడద పెరగడంతో సర్పంచ్ నక్కా అరుణకుమారి ఆదేశాల మేరకు పంచాయతీ శానిటేషన్ సిబ్బంది కామనగరువు పంచాయతీ పరిధిలో సోమవారం ఫాగింగ్ నిర్వహించారు.



కంసాలమామిడికి చేరిన ముంపు నీరు



ఇందుపల్లిలో ముంపు బారిన పడిన పాఠశాల



గురజాపులంకలో నీట మునిగిన పూరిల్లు



యానాం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గౌతమి గోదావరి

ఉరకలెత్తుతున్న ఉగ్ర గోదావరి

- వరద ఉధృతికి చిగురుటాకుల్లా వణుకుతున్న ఊళ్లు
- ప్రజలకు కంటి మీద కునుకు కరవు

అల్లవరం: గోదావరి శాంతించకపోవడంతో వరద ఉధృతికి లంక గ్రామాలన్నీ చిగురుటాకుల్లా వణుకుతున్నాయి. ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి సోమవారం సాయంత్రం 14.42 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువనకు విడుదల చేశారు. గంట గంటకూ నీటి మట్టం పెరుగుతుండడంతో ప్రజలకు కంటి మీద కునుకు కరవైంది. మంగళవారం ఉదయానికి వరద తీవ్రత కొంత మేర తగ్గుముఖం పట్టొచ్చని అధికారులు చెబుతున్నారు. అయితే వరద కారణంగా ముంపుబారిన పడిన గ్రామాల్లో సహాయక చర్యలు అందడం లేదంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బాధితులను పట్టించుకోరా?

బోడసకుర్రు పల్లిపాలెంలోని మత్స్యకారుల ఇళ్లు వరద నీటిలో చిక్కుకున్నాయి. సోమవారం నాటికి వరద తీవ్రత బాగా ఎక్కువగా ఉంది. వారం రోజులుగా వరద ఉధృతంగా ప్రవహించడంతో బోడసకుర్రు గ్రామంలోని పల్లపు ప్రాంతాలు కంసాలమామిడి, గౌతమినగర్ కాలనీలను ముంపునీరు పోటెత్తుతుంది. వరద నీరు గోపాయిలంక వద్ద అవుట్‌పాల్ స్లూయిజ్ గుండా దేశికోడు డ్రెయిన్‌లోకి ఎదురెక్కి బోడసకుర్రు, అల్లవరం, కోడూరుపాడు గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలను ముంచెత్తుతుంది. దీంతో వందలాది ఎకరాల్లో వరి పొలాలు ముంపు బారిన పడ్డాయి. వరద ప్రభావంతో కంసాలమామిడి, గౌతమినగర్ కాలనీలను వరద ముంచెత్తింది. వారం రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడు కరవయ్యాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా ముంపులోనే ఉంటే కనీసం ఒక్క ప్రజా ప్రతినిధి కూడా వచ్చి చూసిన దాఖలాలు లేవని వాపోయారు. వరద బాగా పెరగడంతో స్థానిక సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, తహసీల్దార్ సునీల్‌కుమార్ ఆదివారం వచ్చి పరామర్శించి వెళ్లిపోయారని ముంపు బాధితులు తెలిపారు. ముంపు బాధితుల్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గోడితిప్ప పంచాయతీ గోపాయిలంక వద్ద దేశికోడు డ్రెయిన్ అవుట్ స్లూయిజ్‌ని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదివారం సందర్శించారు. అవుట్ స్లూయిజ్ నుంచి వరద నీరు రాకుండా గేట్లు అమర్చవలసి ఉందన్నారు. దీనిపై డ్రెయిన్ శాఖాధికారులతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.



బోడసకుర్రు పల్లిపాలెంలో వరద ప్రభావంతో మునిగిన ఇళ్లు

కొనసాగుతున్న వరద

ముమ్మిడివరం: ముమ్మిడివరం నియోజకవర్గంలో వరద ఉధృతి కొనసాగుతోంది. సోమవారం మరో మూడు అడుగుల మేరకు నీటి మట్టం పెరిగింది. వివేకానంద వారధి, గురజాపులంక, సిమెంట్ రోడ్డు, కూనాలంక, పాఠశాల నుంచి గురజాపులంక తుఫాన్ షెల్టర్ వరకూ నీట మునిగాయి. గురజాపులంక, కూనాలంకలో అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. లంకాఫ్ ఠానేల్లంక, లంకాఫ్ గేదెల్లంక, చింతపల్లిలంక, సలాదివారిపాలెం తదితర గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలన్నీ వరద నీటిలో మునిగాయి. లంక గ్రామ ప్రజల రాకపోకలకు ఆరు మిషన్ బోటులు, ఐదు ఇంజిన్ పడవలు ఏర్పాటు చేశారు. ప్రత్యేకాధికారి ఎస్.మధుసూదన్, తహసీల్దార్ బి.శ్రీనునాయక్, వీఆర్వోలు వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.



లంక గ్రామాల ప్రజలను నాటు పడవలపై తరలిస్తున్న అధికారులు

యానాం: యానాం వద్ద గౌతమిగోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుంది. వరద నీరు రాజీవ్ రివర్‌బీచ్ పైనుంచి ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో సందర్శకులను అనుమతించడం లేదు. ఇప్పటికే భరతమాత విగ్రహం, పుష్కరమాత విగ్రహాలను తాకుతూ వరద నీరు ప్రవహిస్తుంది. అదే విధంగా బాలయోగి కాలనీ, ఓల్డ్‌రాజీవ్‌నగర్ తదితర ప్రాంతాలకు వరద రావడంతో మోటార్ల సహాయంతో నీటిని తోడుతున్నారు. వరంపేట, అయ్యన్ననగర్‌ల్లో బాధితులకు యానాం ఓల్డేజ్ హోమ్ నుంచి భోజనాలను అందజేశారు.

ఇందుపల్లి, సాకుర్రు గ్రామాల్లోకి వరద నీరు

అమలాపురం రూరల్: గోదావరి వరద ఇందుపల్లి, సాకుర్రు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది. అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల చుట్టూ వరద నీరు చేరుకుంది. ఇందుపల్లి గరువు, జాంబవానిపేట, జల్లివారిపేట, ఆర్‌ఆర్‌నగర్, బండారులంక గ్రామంలోని వల్లూరివారి కాలనీల్లో వరద నీరు ప్రవహిస్తోంది. సాకుర్రు గ్రామంలోని బాలకృష్ణ నగర్, న్యూకాలనీ ప్రాంతాల్లోకి వరద చేరుకుంది. గున్నేపల్లి అగ్రహారం గ్రామంలో ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముంపు బాధిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పర్యటించి బాధితులను పరామర్శించారు.



యానాంలో పుష్కరమాత విగ్రహం వరకూ చేరుకున్న వరద నీరు



గోపాయిలంక వద్ద అవుట్ స్లూయిజ్‌ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు



వరద ముంపులో లంకాఫ్ ఠానేల్లంక మత్స్యకార కాలనీ



ఇందుపల్లిలో ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎంపీడీవో మల్లికార్జునరావు

శరవేగంగా వెంకన్న ఆలయ నిర్మాణ పనులు

యానాం: పట్టణంలో కొలువైన శ్రీభూసమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయ పనులు టీటీడీ ఆధ్వర్యంలో శరవేగంగా జరుగుతున్నాయని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. సోమవారం ఆలయ ఆవరణలో ఆలయ నిర్మాణ కమిటీతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరితగతిన ఆలయాన్ని పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.7 కోట్లతో ఆలయ నిర్మాణం జరుగుతుందన్నారు. మరో నాలుగు నెలల్లో పనులు పూర్తవుతాయని భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ కె.రామకృష్ణ, ఎన్ఆర్‌కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, గుత్తుల రామారావు, కాపగంటి ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.



వెంకన్న ఆలయ నిర్మాణ కమిటీ సమావేశంలో మల్లాడి తదితరులు

సినారెకు ఘన నివాళి

అమలాపురం టౌన్: సాహితీవేత్త, రచయిత డాక్టర్ సి.నారాయణరెడ్డి (సినారె) జయంతి కార్యక్రమాన్ని స్థానిక భూపయ్య అగ్రహారంలోని రుద్రరాజు ఆడిటోరియంలో సోమవారం నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ, మున్సిపల్ కౌన్సిలర్ గొవ్వాల రాజేష్ తదితరులు సినారె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ శ్రీపాద రామకృష్ణ, జాలి వాకర్ కడలి సత్యనారాయణ, మహిళా ఆరోగ్య సేవా సంస్థ ప్రతినిధులు కె.రామలక్ష్మి, డి.సత్యవేణి, ఎస్.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సినారె చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నానిరాజు తదితరులు

సీఎం రంగసామితో సురేనా భేటీ

యానాం: బీజేపీ-ఎన్ఆర్ కాంగ్రెస్ ఎన్డీయే కూటమి ప్రభుత్వంతో బీజేపీ ఎమ్మెల్యేలు, మద్దతుగా ఉన్న స్వతంత్ర ఎమ్మెల్యేల విభేదాలు, అసంతృప్తుల నేపథ్యంలో సీఎం రంగసామితో బీజేపీ సీనియర్ నేత ఇన్‌చార్జి నిర్మలకుమార్ సురేనా సోమవారం భేటీ అయ్యారు. సుమారు 30 నిమిషాలసేపు పుదుచ్చేరి రాజకీయాలపై చర్చించారు. ఈ నెల 31వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకూ పుదుచ్చేరి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. సమావేశాల్లో బీజేపీ, ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పడానికి వ్యూహం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో సీఎం రంగసామి, బీజేపీ సీనియర్ నేత నిర్మలకుమార్ సురేనాల భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.

పాక తొలగించారని ఆవేదన

తాళ్లరేవు: తమ స్థలంలో నూతనంగా ఇల్లు నిర్మించుకునే క్రమంలో, ఇంటి ఎదురుగా తాత్కాలికంగా నిర్మించుకున్న పాకను పంచాయతీ అధికారులు తొలగించారని గాడిమొగ పంచాయతీ తిమ్మరాజుపురం గ్రామానికి చెందిన పులపకూర కృష్ణమూర్తి, మల్లేశ్వరరావులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం బాధితులు మాట్లాడుతూ ఇంటి నిర్మాణం సందర్భంగా తాత్కాలికంగా తలదాచుకునేందుకు వేసుకున్న పాకను పంచాయతీ అధికారులు తొలగించి ఇంట్లో సామాన్లు చిందరవందరగా పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు పడుతున్నందున పాక తొలగింపునకు కొద్ది రోజుల గడువు కోరామని అంతలోనే తొలగించడం దారుణమని వాపోయారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి వీజేవీ రమణను వివరణ కోరగా గ్రామంలోని మురుగునీరు దిగకుండా మట్టితో కప్పి పాక నిర్మించారని, దీనివల్ల ఇబ్బందులు పడుతున్నట్లు ఎనిమిది మంది ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై పులపకూర కృష్ణమూర్తికి సమాచారం అందించి పాకను తొలగించామన్నారు.

వన సంరక్షణే మన సంరక్షణ

కాట్రేనికోన: స్థానిక ఫ్రెండ్లీ క్లబ్ ఆధ్వర్యంలో వన సంరక్షణే మన సంరక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం కడియపులంక పల్లా వెంకట్రావు నర్సరీ సహకారంతో మొక్కలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఫ్రెండ్లీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకొండి నాగ రవీంద్ర జోగయ్య శాస్త్రి మొక్కలను ఎంఈఓ కేటీవీ సుబ్రహ్మణ్యం, జెడ్పీహెచ్ హెచ్ఎం ఎం.వెంకటేశ్వరరావు, ఎస్ఐ బి.నాగేశ్వరరావులకు మొక్కలను అందచేశారు. అనంతరం కాట్రేనికోన జెడ్పీహెచ్ పాఠశాల, పోలీస్‌స్టేషన్ వద్ద మొక్కలను నాటారు. కార్యక్రమంలో తాతపూడి లక్ష్మీనారాయణమూర్తి, గ్రంథి నానాజీ, సుంకర పవిత్ర కుమార్, ఉమా మహేష్ తదితరులు పాల్గొన్నారు.



కాట్రేనికోన జెడ్పీహెచ్ పాఠశాలలో మొక్కలను అందజేస్తున్న ఫ్రెండ్లీ క్లబ్ సభ్యులు

సముద్రపు ఒడ్డున మృతదేహం లభ్యం

అల్లవరం: మండలంలోని ఓడలరేవు సముద్ర తీరం నదీ సంగమం వద్ద వ్యక్తి మృతదేహాన్ని అల్లవరం పోలీసులు గుర్తించారు. మృతుడు రాజోలు గ్రామానికి చెందిన సానబోయిన సత్యనారాయణ(69)గా గుర్తించారు. ఈ నెల 25వ తేదీన పి.గన్నవరంలోని బంధువుల ఇంటికి వెళ్లిన సత్యనారాయణ ప్రమాదవశాత్తూ కాలు జారి గోదావరిలో పడిపోయాడు. 28వ తేదీ ఆదివారం ఓడలరేవు సముద్రతీరంలో మృతదేహం ఉన్నట్లు సమాచారం అందింది. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరీష్ కుమార్ తెలిపారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి

ఉప్పలగుప్తం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంఈఓ కిరణ్‌బాబు అన్నారు. విద్యా వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా విలసవిల్లిలో సర్పంచ్ సలాది ఉర్మిళాదేవి అధ్యక్షతన విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్లను సోమవారం అందజేశారు. చల్లపల్లి, పెదగాడవిల్లి గ్రామాల్లో ఆయా సర్పంచ్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇసుకపట్ల జయమణి, జి.మహాలక్ష్మి, ఎంపీటీసీ నిమ్మకాయల స్వామినాయుడు, ఎస్.సత్యకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

మనుబాకర్‌కు అభినందనలు



చిత్రకారుడు ఆకొండి అంజి గీసిన మనుబాకర్ చిత్రం

కాట్రేనికోన: ప్రపంచ ఒలింపిక్ క్రీడా పోటీలు-2024లో భారతదేశానికి తొలి పతకాన్ని సాధించిన యువ షూటర్ మను బాకర్‌కు అభినందనలు తెలుపుతూ ప్రముఖ చిత్రకారుడు ఆకొండి అంజి ఆమె చిత్రాన్ని గీశారు. పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్-2024 ప్రపంచ క్రీడా పోటీల్లో మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో మనుబాకర్ అత్యుత్తమ ప్రదర్శనతో కాంస్య పతకాన్ని గెలుచుకుంది.

వరద సహాయక చర్యల్లో కూటమి విఫలం



సఖినేటిపల్లి లాకుపేటలో బాధితులకు ఆహార పొట్లాలు అందిస్తున్న పాటి శివకుమార్

సఖినేటిపల్లి: వరద బాధితులకు సహాయక చర్యలు అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ పాటి శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం సఖినేటిపల్లి లాకుపేటలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులకు గత ప్రభుత్వంలో ముంపుకు గురైన ప్రతి కుటుంబానికి వారి అకౌంట్‌లో నష్ట పరిహారం వేశారని ఇప్పుడు నష్ట పరిహారం కావాలంటే శిబిరాల్లోకి వచ్చి ఉంటేనే పరిహారం ఇస్తామని అధికారులు చెప్పడం దారుణమన్నారు. మంచినీరు తప్ప ముంపు కుటుంబాలకు ఆహారం, పిల్లలకు పాలు అందించలేకపోతున్నారన్నారు. ఇకనైనా వరద బాధితులకు సరైన భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సఖినేటిపల్లి లాకుపేటలో వరద బారిన పడిన 300 మందికి భోజన, పాల ప్యాకెట్లని శివకుమార్ పంపిణీ చేశారు.

సూపర్ సిక్స్ ఎప్పటికి అమలు చేస్తారు

మామిడికుదురు: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను తక్షణం అమలు చేయాలని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు డిమాండ్ చేశారు. ఆయన మామిడికుదురులో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 50 రోజులు దాటినా ఎక్కడా సూపర్ సిక్స్ పథకాల ప్రస్తావన లేకపోవడం బాధాకరమన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని గుర్తు చేశారు. కానీ సీఎం చంద్రబాబు హామీలను ఏవిధంగా ఎగ్గొట్టాలా అని ఆలోచిస్తున్నారన్నారు. హామీల పేరిట ప్రజల్ని మోసగించడం తగదన్నారు. తప్పుడు ప్రచారంతో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించడమే ధ్యేయంగా కూటమి నేతలు పని చేస్తున్నారని, విమర్శలు మాని మీ సత్తా ఏంటో పాలనలో చూపాలని వేణుగోపాలరావు డిమాండ్ చేశారు. పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం చేతకాని కూటమి ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌తో కాలక్షేపం చేస్తోందన్నారు. మార్పు అంటే వైఎస్సార్ సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించడం, వారిని హత్య చేయడమేనా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ నేతలపై దాడులు ఆపకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు.



జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు